# లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసులకు పరిష్కార బాట

**ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు**
**తీసుకోవాలి జేఎంఎఫ్‌సీ అరుణ్ కుమార్ నారం**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



ఆమనగల్లు సర్కిల్ పరిధిలోని రాబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న కేసులకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఆమనగల్లు కోర్టులో సోమవారం సాయంత్రం సమన్వయ సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని గౌరవ న్యాయ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జేఎంఎఫ్‌సీ అరుణ్ కుమార్ నారం అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత సీడీఓ అధికారులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, ఆమనగల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారానికి అనువైన కాంపౌండబుల్ కేసులు, అడ్మిషన్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీటీ కేసులను గుర్తించాలని మేజిస్ట్రేట్ సూచించారు. సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుని వీలైనంత ఎక్కువ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేసుల సత్వర పరిష్కారం కోసం పోలీస్ శాఖ, ప్రాసిక్యూషన్ శాఖ, ఎక్సైజ్ శాఖ, న్యాయ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

# యువత స్వయం ఉపాధి రంగాలలో రాణించాలి..

**నూతన దుకాణ సముదాయాన్ని ప్రారంభించిన వెంకటేష్ గుప్త**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



కడ్తాల్ లో అత్యాధునిక వాటర్ ఫిల్టర్, సీసీ టీవీ పరికరాల దుకాణాన్ని ప్రారంభించిన ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు తల్లిదండ్రులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని అందులో రాణించాలని ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో దేరంగుల ప్రవీణ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లు, సీసీ టీవీ పరికరాలు, విడిభాగాలు మరియు సర్వీసింగ్ దుకాణం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ దుకాణాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి వ్యాపార సంస్థకు, నివాసానికి భద్రత కోసం సీసీ కెమెరాలు ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి నాణ్యమైన పరికరాలు, సత్వర సర్వీసులు ఇకపై కడ్తాల్ లోనే అందుబాటులోకి రావడం మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ నూతన సంస్థలో అన్ని కంపెనీల వాటర్ ఫిల్టర్లు, వాటి విడిభాగాలు, సీసీ కెమెరాలు, డీవీఆర్లు మరియు పూర్తి స్థాయి రిపేరింగ్, సర్వీసింగ్ సదుపాయం సరసమైన ధరలకే లభిస్తాయని నిర్వాహకులు దేరంగుల ప్రవీణ్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, మాజీ వార్డు సభ్యులు హెచ్‌ఆర్ మహేష్, కడ్తాల్ మండల ఆర్యవైశ్య సంఘం యువజన ఉపాధ్యక్షుడు గుద్దేటి సాయికుమార్, నాయకులు రాకేష్, శివ, కుకుట్ల శ్రీను, శ్రీకాంత్, జగదీష్, బాలాజీ నాయక్, పలువురు వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

## జులపల్లిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి ఘన స్వాగతం



**ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన సర్పంచ్, కడారి శేఖర్ యాదవ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండ పల్లి మండలంలోని జులపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని జులపల్లి గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు నరసింహ, సురేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. జులపల్లి గ్రామంలో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర ప్రజా అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సహకరించాలని ఎమ్మెల్యేను వారు కోరారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు మరియు ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జులపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, యువత మరియు ప్రజల సమన్వయంతో నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## కొత్త పెన్షన్ల దరఖాస్తు గడువు పెంచాలి

**చేయూత పథకాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి**
**సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్**

అగ్ని ధార న్యూస్,( రామగుండం) :



చేయూత పథకం కింద కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఆగస్టు 31తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తున్న నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పలువురు అర్హులకు సరైన సమాచారం అందక దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. అవసరమైన ధ్రువపత్రాల సమీకరణలో జాప్యం కారణంగా కూడా అర్హులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, చేయూత పథకానికి కఠిన గడువులు విధించకుండా నిరంతరం కొనసాగించాలని డా. మార్షల్ దుర్గం నగేష్ విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

హైదరాబాద్‌లోని తన నివాసంలో వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు మరియు ఎల్‌ఓసీ పత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చుక్కగుట్ట తండా నుంచి జూలపల్లి వరకు ఒక కిలోమీటర్ మేర రూ. 1.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం జూలపల్లి నుంచి చంద్రధన వరకు మూడు కిలోమీటర్ల వరకు 2.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు కూడా శంకుస్థాపన చేశారు. అలాగే జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 15 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా, తొలిదశలో 5 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు, పక్కా గృహాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,స్థానిక సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భగవాన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ అజీజ్, ప్రదీప్ రెడ్డి,తిరుపతి ముదిరాజ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి ప్రత్యేక యంత్రాల ద్వారా పరిశుభ్రత

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



వెల్దండ మండలంలోని బండోనీ పల్లి గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ట్యాంకుల్లో కొంతకాలంగా పేరుకుపోయిన మురికి, వ్యర్థాలు, ఇతర అవశేషాలను ప్రత్యేక యంత్రాల ద్వారా తొలగించి ట్యాంకులను పరిశుభ్రంగా మార్చారు. అనంతరం ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , బశీడౌనీ పల్లి సర్పంచ్ సంగీత శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ , అల్వాల్ యాదవ్,వార్డు సభ్యులు కిషోర్,రాములు, వెంకట్ రెడ్డి,శారద, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని గ్రామస్తులు కోరారు.

## రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ




**రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఆమనగల్ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మరింత అభివృద్ధి సాధించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. ఆమనగల్ పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ఆమనగల్, కడ్తల్ మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతుల సమక్షంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగు సమయంలో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. అనంతరం ఆమనగల్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో నిర్వహించిన పోచమ్మ బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచమ్మ అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం బోనాల వేడుకల్లో పాల్గొన్న ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పి ఎ సి ఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, మహిళలు, భక్తులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మార్చాల గ్రామంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌ను రద్దు చేయాలి





**కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, జెఎసి నాయకులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌ను రద్దు చేయాలని కోరుతూ మార్చాల సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మార్చాల జె ఎ సి నాయకులు, ప్రజా ప్రతినిధులు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కేశవ్ పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. మార్చాల గ్రామంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామ ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యూనిట్ ఏర్పాటును రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలను పునఃపరిశీలించాలని కోరారు. సమస్యపై అధికారులు సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిజాముద్దీన్, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్, మాయని సుమంత రాజశేఖర్, రజిత మల్లేష్, పర్వత్ రెడ్డి, సికిందర్, యాదిరాల యాదయ్య, బిజినపల్లి స్వాతి బాలరాజు, పల్స అనురాధ జంగయ్య, కంకల అలివేల జంగమయ్య, మాజీ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్చాల జె ఎ సి నాయకులు హరీష్ రెడ్డి, జితేందర్ రెడ్డి, యూసుఫ్ బాబా, శేషిరెడ్డి, శ్రీశైలం, కుర్మయ్య ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బిఅర్ఎస్ నాయకులు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామానికి చెందిన మోటపురం లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది . విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మరియు బిఅర్ఎస్ నాయకులు మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3,500 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ మదన్మోహన్ రావు, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్,బిజినపల్లి స్వాతి బాలరాజు, మాజీ వార్డు సభ్యులు రాంరెడ్డి, బి అర్ ఎస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి , నాకినమోని శ్రీను, మార్చాల శ్రీను, గోరటి జంగయ్య , పాషా కుటుంబ సభ్యులు రాములు ,ఎట్టయ్యా , శివయ్య , తదితరులు పాల్గొన్నారు



# కుల వివక్షను అరికట్టాలి లేదంటే పోరాటమే

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలనూ అధికారులు బేఖాతరు చేస్తున్నారని ఆరోపణ**
**సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తాం**

**అగ్ని ధార న్యూస్,( పెద్దపల్లి) :**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై కుల వివక్ష కొనసాగుతున్నా అధికారులు, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలు, సూచనలను సైతం అధికారులు అమలు చేయడం లేదన్నారు. కులాన్ని బట్టి న్యాయం జరిగే పరిస్థితులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసులు సకాలంలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదని, కేసులు నమోదైన తర్వాత నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జూలై 18న జరిగిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్షలో బాధితులు సమర్పించిన దరఖాస్తుల్లో అనేకం ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. నిట్టూరు పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాఘవాపూర్ గ్రామ కార్యదర్శి టి. రవీందర్‌కు మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయడాన్ని పునఃపరిశీలించాలని, అకారణంగా సస్పెన్షన్‌కు గురైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అట్రాసిటీ కేసుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తొలుత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆందోళనలు చేపట్టి, అవసరమైతే కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మధు, జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, మాజీ ప్రజాప్రతినిధి కుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితాంగం ఉద్యమాలకు సిద్ధం కావాలి



**మహాసభ పోస్టర్లను ఆవిష్కరించిన ఏఐకేఎంఎస్ నాయకులు**

**అగ్ని ధార న్యూస్ ,(అంతర్గాం):**

రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతాంగం ఐక్యమై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మేరుగు చంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం అంతర్గాం మండలం పెద్దంపేట్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయ ఆవరణలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా విత్తనాలు, ఎరువుల ధరలు పెంచుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని ఆరోపించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు వ్యతిరేకంగా రైతులు, కూలీలను ఐక్యం చేసి ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

రైతు--కూలీల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు తూల్ల గట్టయ్య, ఉప్పులేటి లింగయ్య, నల్లతీగల రమేష్, బండి శ్రావణ్, పొనగంటి క్రాంతికుమార్, బొడ్డుపల్లి రామస్వామి, పర్కాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్

**రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక**
**పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లిజిల్లా**

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్,ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్ర గౌడ్,రమేష్,ఏఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్,ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వడ్లకొండ నవీన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌పై 5 ఓట్ల ఆధిక్యంతో రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**నూతన కార్యవర్గం**

అధ్యక్షుడు: వి. నవీన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ 291, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్

ఉపాధ్యక్షులు: ఎన్. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ విభాగం; ఎం. తిరుపతి, ఏఎస్ఐ, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ -ప్రధాన కార్యదర్శి: జె. అంజనేయులు, సబ్‌ఇన్‌స్పెక్టర్, సీసీబీ రామగుండం సంయుక్త కార్యదర్శి: కె. ఓంకార్, కానిస్టేబుల్, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్

సంస్థాగత కార్యదర్శి: డి. వినోద్ బాబు, కానిస్టేబుల్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ కోశాధికారి: టి. సుందర్ సింగ్, కానిస్టేబుల్, ధర్మారం పోలీస్ స్టేషన్ కార్యనిర్వాహక సభ్యులు: ఎం.డి. రిజ్వాన్ షా ఖాన్, హెడ్ కానిస్టేబుల్ 714, సీఎస్బీ రామగుండం; డి. అనిల్ కుమార్, కానిస్టేబుల్, సంత్‌నగర్ పోలీస్ స్టేషన్; సి.హెచ్. దేవరాజ్, కానిస్టేబుల్, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ కార్యవర్గ సభ్యులు: ఎం. రాజిత, మహిళా పోలీస్ కానిస్టేబుల్, పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్; ఎ. కపిల్, ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్, సీఏఆర్ రామగుండం; డి. రాజం, ఏఆర్ఎస్ఐ, సీఏఆర్ బెల్లంపల్లి.ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలను అందజేశారు.ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం విజయం సాధించిన అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారికంగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ,వారి సంక్షేమం కోసం కృషి చేయాలని సీపీ ఆకాంక్షించారు. సంఘం బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేస్తూ పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు.

## విద్యారంగానికి ఇందిరాదేవి సేవలు చిరస్మరణీయం



**31 ఏళ్ల సేవలకు ఘన సన్మానం**
**టీఈపీఏ వ్యవస్థాపకుడు దార మధు**

**అగ్ని ధార న్యూస్ ,(కరీంనగర్):**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టీఈపీఏ) వ్యవస్థాపకుడు దార మధు అన్నారు. చింతకుంట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల--జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయురాలిగా 31 ఏళ్లపాటు సేవలందించిన రామోజుల ఇందిరాదేవి పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన దార మధు ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాదేవి విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారని తెలిపారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారి సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. మూడు దశాబ్దాలకు పైగా నిబద్ధత, నిజాయితీతో సేవలందించిన ఆమెకు విద్యార్థులు, సహచరులు, అధికారులు అభిమానాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణతో విధి బాధ్యతలు ముగిసినా, విద్యారంగానికి ఆమె అందించిన సేవల జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో టీఈపీఏ నాయకులు కాల్వ కుమార్, జేరుపోతుల రాజు, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గురుకుల పాఠశాల--జూనియర్ కళాశాల పేరెంట్స్ కమిటీ ఉపాధ్యక్షుడు లంకదాసరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి గుండేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్లలో మేర కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి



**బీసీ కార్పొరేషన్ ఈడీకి మేర సంఘం వినతి**

**అగ్నిధార న్యూస్ ,(సిద్దిపేట):**

కుట్టు మిషన్ పథకంలో మేర కులస్తులకు 50 శాతం కుట్టు మిషన్లు కేటాయించాలని మేర సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాపురం కృష్ణ (కరాటే) కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో బీసీ కార్పొరేషన్ ఈడీ రఫిక్‌ను కలిసి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. కుట్టు మిషన్ పథకంలో మేర కులస్తులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. తమ సంఘం ద్వారా శిక్షణ పొందిన మహిళలకు పథకం కింద కుట్టు మిషన్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈడీ సానుకూలంగా స్పందించి మేర కులస్తులకు ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేర సంఘం నాయకులు రామగిరి నాగేశ్వర్, పొడిసెట్టి శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, పెండ్యాల కిషన్, రేణికుంట్ల శ్రీనివాస్, జర్నలిస్టు గూడూరు లావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ రహదారి నరకానికి నకలు

**గుంతల మయంగా మంథని - చిన్న ఓదాల రోడ్డు విద్యార్థుల నరకయాతన.**
**మారదా ఈ దుస్థితి..! బండి చక్రం అదుపు తప్పితే ఇక సెలవే.**
**నరకయాతన అనుభవిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు**

**అగ్నిధారన్యూస్, మంథని:**



పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రానికి పట్టుమని పది కిలోమీటర్ల దూరం లేని గ్రామాల పరిస్థితి ఇది.. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని విధంగా, అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి.మంథని మండలంలోని గోపాల్ పూర్, చిన్న ఓదాల, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. మంథని మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పంట పొలాలకు వెళ్లే రైతులు, విత్తనాలు, ఎరువులు తెచ్చుకునేందుకు, అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా.. ఈరోడ్డే ఆధారం.కానీ ఈ రోడ్డు పరిస్థితి చూస్తే నరకానికి నకలు అన్నట్లు కనిపిస్తుంది. కన్నీళ్లు వస్తాయి. మోకాలి లోతు గుంతలు.. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు గుంతల్లో నీళ్లు నిలిచి చెరువును తలపిస్తోంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో వెళ్లే విద్యార్థులు, .. ప్రతి ఒక్కరూ భయం భయంగా ప్రయాణం చేయాల్సిందే. బండి చక్రం .. అదుపు తప్పితే ప్రాణాలు గాల్లో కలిసిపోవడం ఖాయం.

**అసలు కారణం ఏంటి**

గోపాల్ పూర్ శివారులోని మానేరు వాగు నుండి ఇసుకను తరలిస్తున్న భారీ లారీలే ఈ దుస్థితికి కారణమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ వందలాది లారీలు ఇదే రోడ్డుపై నుంచి వెళ్లడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రభుత్వానికి మానేరు ఇసుక ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా, ఆ ఆదాయంలో ఒక్క శాతం కూడా ఈ రోడ్డు మరమ్మత్తుకు ఖర్చు చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి, విద్యార్థుల ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయాలని, కొత్త రోడ్డు వేయాలని గోపాల్ పూర్, చిన్న ఓదాల, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు సంబంధిత శాఖ అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.లేని పక్షంలో రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.ఈ రోడ్డు దుస్థితిపై అధికారులు ఎప్పుడు కళ్లు తెరుస్తారో చూడాలి.

## సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

గోదావరిఖనిలో అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. సోమవారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో కౌన్సిల్ సమావేశాల కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు 34 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. తొలిసారిగా గోదావరిఖనిలో నిర్వహిస్తున్న ఈ సమావేశాల విజయవంతానికి ఉద్యోగులు, కార్మికులు, అధికారులు, శ్రేయోభిలాషులు ఆర్థిక, హార్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలు, ఎన్నికల హామీల అమలు తదితర అంశాలపై సమావేశాల్లో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, నాయకులు ఎన్.బిక్షపతి, మెండె శ్రీనివాస్, బి.వనజారాణి, జి.జ్యోతి, ఎం.రామాచారి, తాండ్ర అంజయ్య, జి.లక్ష్మారెడ్డి, ఎం.డి.యాకూబ్, సీహెచ్.ఉపేందర్, ఎస్.వెంకటస్వామి, మాతంగి రాజమల్లు, నేరవెట్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల ప్రజాపాలనలో కార్మిక సంక్షేమానికి పెద్దపీట

**ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర అభివృద్ధితో పాటు కార్మికులు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు.రైతులకు పంట రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, సన్నధాన్యానికి బోనస్ వంటి చర్యలు రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు సామాన్య కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.యువతకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టడం, పారిశ్రామిక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. మౌలిక వసతుల అభివృద్ధితో రాష్ట్రంలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతితోపాటు కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పారిశ్రామిక రంగంలో కార్మిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని జనక్ ప్రసాద్ కోరారు. ప్రజాపాలన మరింత బలోపేతమై తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణి లో 12 దరఖాస్తులు స్వీకారణ

**ఎంపీడీఓ శ్రీజ రెడ్డి**

**అగ్నిధార న్యూస్ మంథని :**



మంథని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో 12 దరఖాస్తు లు స్వీకరించినట్లుగా ఎంపీడీఓ కే. శ్రీజ రెడ్డి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. దానిలో 2 ఇందిరమ్మ ఇండ్లు, 8 రెవిన్యూ కు, 1 మున్సిపల్, 1 పంచాయతీ రాజ్ కు మొత్తం 12 దరఖాస్తు లు వచ్చినట్లు తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమం లో ఎంపీడీఓ, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు నేతకాని-- మహర్ సంఘం నాయకుల ఆశీర్వాదం

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటిచేను గ్రామంలో సోమవారం జరిగిన వివాహ వేడుకకు నేతకాని-- మహర్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభాకర్ సోదరుని కుమారుడు చి. బోర్లకుంట రాజేష్--సౌమ్యల వివాహం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు యేస్కూరి రాజమల్లు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాగం మల్లేష్, సర్పంచ్ శరత్, రాష్ట్ర నాయకుడు రామ్‌చందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామటేంకి వాసుదేవ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, రాయమల్లు, యువజన నాయకుడు రంటెంకి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిమెంట్లపై దుష్ప్రచారం సరికాదు

**అగ్నిధార న్యూస్,( రామగుండం) :**



సింగరేణి అగ్రిమెంట్లపై గుడ్డి వ్యతిరేకతతో కార్మికులను తప్పుదోవ పట్టించేలా కొన్ని సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను విమర్శించారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ సమ్మె ప్రధాన డిమాండ్లలో ఒకటైన అలవెన్సులపై పడే ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించేలా అగ్రిమెంట్ సాధించామని తెలిపారు.గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ పెర్క్‌పై ఆదాయపు పన్నును ఎందుకు రద్దు చేయించలేకపోయిందని ప్రశ్నించారు. కోల్ ఇండియాలో కొన్నేళ్లుగా పెర్క్‌పై పన్నును యాజమాన్యాలే భరిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత అగ్రిమెంట్ వల్ల కార్మికులకు పరిస్థితులను బట్టి సుమారు రూ.50 వేలకుపైగా ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.సింగరేణిలో రాజకీయ జోక్యం, ఆర్థిక అవకతవకలకు గత పాలకులు కారణమని ఆరోపించారు. కొత్త గనుల కేటాయింపులోనూ కార్మిక ప్రయోజనాలకు నష్టం జరిగిందన్నారు. హక్కుల కోసం పోరాడిన ఏఐటీయూసీపై విమర్శలు చేయడం ద్వారా ఇతర సంఘాలు తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. కార్మికులు వాస్తవాలను గ్రహించి ఏఐటీయూసీపై విశ్వాసం ఉంచాలని రంగు శ్రీను కోరారు.

